సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

శనివారం । 24 । ఫిబ్రవరి । 2024



సర్దుబాటు సరే.. జీతాలేవి?

104 వ్యవస్థను రద్దు చేసి ఉద్యోగులను ఆస్పత్రుల్లో సర్దుబాటు చేసిన అధికారులు వేతనాలు మాత్రం ఇవ్వడంలేదు. 8లో



వనదేవతల దర్శనం

తోగ్గూడెం, బొజ్జాయిగూడెం తదితర ప్రాంతాల్లోని వనదేవతలను భక్తులు దర్శించుకుని పూజలు చేస్తున్నారు. 9లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం

34° / 22°

జిల్లాలో శనివారం మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. రాత్రి వేళ వాతావరణం చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నేడు సహస్ర కలశాభిషేకం



బేడా మండపం వద్ద ఆవాహనం చేసిన కలశాలు

భద్రాచలం: శ్రీ సీతారామ చంద్రస్వామి వారి దేవస్థానంలో శనివారం సహస్ర కలశాభిషేకం జరిపేందుకు అర్చకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. శుక్రవారం బేడా మండపంలో వెయ్యి కలశాలను వరుస క్రమంలో అమర్చి శాస్త్రోక్తంగా దేవతావాహనం నిర్వహించారు. యాగశాలలో పూజలు జరిపారు. శనివారం శ్రీ సీతాలక్ష్మణ సమేతుడైన రామయ్య స్వామికి సహస్ర కలశాభిషేకంతోపాటు శ్రీ రంగనాథ స్వామి వార్షిక తిరుకల్యాణోత్సవం నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో శుక్ర, శనివారాల్లో నిత్య కల్యాణాలను రద్దు చేశారు.

పెద్దమ్మతల్లికి ప్రత్యేక పూజలు



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లికి వైభవంగా పంచామృతాభిషేకం నిర్వహించారు. మండలంలోని శ్రీకనకదుర్గ(పెద్దమ్మతల్లి) ఆలయంలో అమ్మవారికి శుక్రవారం అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి జన్మస్థలం వద్ద పంచామృతం, పసుపు, కుంకుమ, గాజులు, హారతి సమర్పించారు. అనంతరం ఆలయంలోని మూలవిరాట్‌కు పంచామృతంతో అభిషేకం జరిపారు. పంచహారతులు, నివేదన, నీరాజనం, మంత్రపుష్పం, కుంకుమపూజ, గణపతిహోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈఓ ఎన్.రజనీకుమారి, ఆలయ కమిటీ చైర్మన్ మహిపతి రామలింగం, సభ్యులు చింత నాగరాజు, గంధం వెంగళరావు పాల్గొన్నారు.

రేపు ఛత్తీస్‌గఢ్ సీఎం రాక



సీఎం సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఏఎస్పీ

భద్రాచలం: ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్ సాయి ఆదివారం భద్రాచలం రానున్నారు. భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామిని దర్శించుకోవడంతోపాటు బీజేపీ ఆధ్వర్యాన నిర్వహించే విజయ సంకల్ప రథయాత్రను ప్రారంభించి సభలో ప్రసంగిస్తారు. ఈ సందర్భంగా కొత్త మార్కెట్ మైదానంలో ఏర్పాటు చేస్తున్న సభావేదిక, ఏర్పాట్లను ఏఎస్పీ పరితోష్ పంకజ్ శుక్రవారం పరిశీలించారు. ఆ తర్వాత బీజేపీ నాయకులను అడిగి పర్యటన, సభ వివరాలు తెలుసుకున్నారు.

ఎస్సీ స్టడీ సర్కిల్‌లో శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానం

ఖమ్మంమయూరిసెంటర్: బ్యాంకింగ్, ఆర్ఆర్‌బీ, ఎస్ఎస్‌సీతో సహా రాష్ట్రప్రభుత్వం నిర్వహించే ఉద్యోగ పోటీ పరీక్షల కోసం ఎస్సీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యాన ఐదు నెలల ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు డీడీ కస్తాల సత్యనారాయణ తెలిపారు. అభ్యర్థులు మార్చి 6వ తేదీ లోపు టీఎస్ స్టడీసర్కిల్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకుంటే, మార్చి 10న నిర్వహించే పరీక్షలో మెరిట్ సాధించిన వంద మందిని ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. వీరికి మార్చి 18 నుండి ఆగస్టు 17వ తేదీ వరకు ఖమ్మంలోని ఎస్సీ స్టడీ సర్కిల్‌లో ఉచిత భోజనం, వసతి కల్పించి శిక్షణ ఇస్తామని తెలిపారు. వంద సీట్లల్లో 75 శాతం ఎస్సీలకు, 10 శాతం ఎస్టీలకు, 15 శాతం బీసీలకు రిజర్వేషన్ ఉంటుందని.. మొత్తంగా మహిళలకు 33 శాతం సీట్లు కేటాయిస్తామని, ఐదు సీట్లు దివ్యాంగులకు రిజర్వ్ చేస్తామని వెల్లడించారు. కాగా, గతంలో శిక్షణ పొందిన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకునేందుకు అనర్హులని డీడీ తెలిపారు.

శరవేగంగా 'సోలార్' పనులు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధిలోని శ్రీ ఇంక్లైన్ సమీపంలో సింగరేణి యాజమాన్యం 10.5 మెగావాట్ల సామర్థ్యం కలిగిన సౌరవిద్యుత్ ప్లాంట్ నిర్మాణం చేపడుతోంది. శుక్రవారం ఏరియా డీవైఎస్ఈ (సివిల్) రాజారామ్ పనులను పర్యవేక్షించారు. ఈ నెల 25న రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్లాంట్‌ను ప్రారంభించనుండగా, అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఇంటికి వెలుగు వంటింటికి తోడ్పాటు





మరో రెండు గ్యారంటీల అమలుకు గ్రీన్ సిగ్నల్

- ఈ నెల 27 నుంచి గృహజ్యోతి అమలు, సబ్సిడీ గ్యాస్ వర్తింపు
- ఇప్పటికే విచారణ పూర్తి చేసి అర్హులను తేల్చిన అధికారులు
- ఉమ్మడి జిల్లాలోని పలు కుటుంబాలకు ప్రయోజనం

చుంచుపల్లి: ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో మరో రెండు పథకాల అమలుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గృహజ్యోతి, గ్యాస్ సిలిండర్ పథకాల అమలుపై గురువారం సమీక్ష నిర్వహించిన విషయం విదితమే. ఈ నెల 27 నుంచి అమలు చేయాలని ఆదేశించారు. ఇప్పటికే అధికారులు గృహజ్యోతి, గ్యాస్ సిలిండర్ పథకాల దరఖాస్తు దారుల ఇళ్లకు వెళ్లి క్షేత్రస్థాయిలో విచారణ చేశారు. ఈ రెండు పథకాలకు ఉమ్మడి జిల్లాలో ఎంతమంది అర్హులున్నారనేది ప్రాథమికంగా తేల్చారు. గ్యారంటీ పథకాలకు గత డిసెంబర్ 28 నుంచి జనవరి వరకు ప్రజాపాలన కార్యక్రమం నిర్వహించి దరఖాస్తులు స్వీకరించగా, ఉమ్మడి జిల్లాలో 8,21,541 అర్జీలు వచ్చాయి. కాగా ఎన్నికల ముందు ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్, అధికారంలోకి రాగానే ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం పథకాన్ని అమలు చేస్తోంది. ఆరోగ్యశ్రీ పథకాన్ని రూ. 5 లక్షల నుంచి రూ. 10 లక్షలు పెంచింది.

ఇంటింటా గృహజ్యోతి

గృహజ్యోతి పథకం కింద గృహాలకు 200 యూనిట్ల లోపు విద్యుత్ ఉచితంగా అందించేందుకు సన్నాహాలు చేస్తోంది. ఇటీవల విద్యుత్ శాఖ అధికారులు ఉమ్మడి జిల్లాలో ఇంటింటికీ వెళ్లి ప్రజాపాలన దరఖాస్తుల ఆధారంగా వివరాలు సేకరించారు. లబ్ధిదారుని రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, సెల్‌ఫోన్ నంబర్‌ను విద్యుత్ సర్వీస్ నంబర్‌తో అనుసంధానం చేశారు. ఉమ్మడి జిల్లాలో 7,08,940 గృహ అవసరాల విద్యుత్ కనెక్షన్లు ఉండగా, వీటిలో నెలకు 200 యూనిట్ల వరకు వినియోగించేవి 6,36,320 కనెక్షన్లు ఉన్నాయి. ఖమ్మం జిల్లాలో మొత్తం 4,28,315 విద్యుత్ కనెక్షన్లు ఉండగా, 200 యూనిట్లలోపు వినియోగించే కుటుంబాలు 3,85,227 ఉన్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 2,80,625 విద్యుత్ కనెక్షన్లు ఉండగా, అందులో 200 యూనిట్లలోపు వాడుకునే కుటుంబాలు 2,51,093 ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో ప్రతినెలా 73.165 మి.యూ విద్యుత్‌ను వినియోగిస్తుండగా, 200 యూనిట్లలోపు వాడుకునే కుటుంబాలు 49 మి.యూ వినియోగించుకుంటున్నారు. ఉమ్మడి జిల్లాలో దాదాపు ఉన్న విద్యుత్ కనెక్షన్లలో 90 శాతం మందికి పథకం వర్తించనుంది. అమలుకు లబ్ధిదారుని రేషన్ కార్డును ప్రామాణికంగా తీసుకోనున్నారు. పథకం అమలుతో ప్రతినెలా సుమారు రూ. 21 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం సంబంధిత విద్యుత్ సంస్థలకు చెల్లించాల్సి ఉంటుంది.

తీరనున్న బండ భారం

గ్యాస్ సబ్సిడీ హామీని కూడా ఈ నెల 27 నుంచి అమలు చేయనున్నారు. ఇప్పటికే దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లి అధికారులు విచారణ చేపట్టారు. గ్యాస్ ఏజెన్సీ పేరు, ఫోన్ నంబర్, రేషన్‌కార్డు నంబర్లను ప్రత్యేక యాప్‌లో నమోదు చేసుకున్నారు. పూర్తిస్థాయిలో కసరత్తు చేసి అర్హుల సంఖ్య తేల్చారు. రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇవ్వనుండగా, గృహ వినియోగదారులందరికీ లబ్ధి చేకూరనుంది. ఉమ్మడి జిల్లాలోని 61 గ్యాస్ ఏజెన్సీల పరిధిలో మొత్తం 7,58,341 కనెక్షన్లు ఉన్నాయి. ఖమ్మం జిల్లాలో 4,10,404, భద్రాద్రి జిల్లాలో 3,47,937 కనెక్షన్లు ఉన్నట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. గ్యాస్ రాయితీతో ఉమ్మడి జిల్లాలో ప్రతి నెలా ప్రభుత్వం సుమారు రూ.40 కోట్లను గ్యాస్ ఏజెన్సీలకు చెల్లించాల్సి ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు. గృహజ్యోతి, గ్యాస్ సబ్సిడీ పథకాల అమలుతో పేద, మధ్య తరగతి కుటుంబాలపై ఆర్థిక భారం తగ్గనుంది.

నిరుపేదలకు మేలు



ప్రభుత్వం రూ.500కే గ్యాస్ సిలిండర్ అందిస్తే మాలాంటి పేదలకు ఎంతో మేలు జరుగుతుంది. కొన్నేళ్లుగా గ్యాస్ సిలిండర్ ధరలు పెరుగుతూ ఉన్నాయి. దీంతో ఆర్థిక ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

– పుట్టి విజయ, గృహిణి

ఆర్థిక వెసులుబాటు..



ప్రభుత్వం గృహజ్యోతి పథకంలో భాగంగా 200 యూనిట్లలోపు వారికి జీరో బిల్ ప్రవేశపెట్టడం మంచి ఆలోచన. దీనివల్ల ప్రతీ పేద కుటుంబానికి ప్రయోజనం కలుగుతుంది. ఆర్థికంగా వెసులుబాటు కలుగుతుంది.

– పి.వెంకటేశ్వర్లు, పాన్‌షాప్

ఎప్పుడు పూర్తయ్యేనో..?



బేస్‌మెంట్ దశలోనే నిలిచిపోయిన మెడికల్ కళాశాల భవన నిర్మాణం

- మెడికల్ కళాశాల భవన నిర్మాణాల్లో తీవ్ర జాప్యం
- బిల్లులు రాక పనులు నిలిపివేసిన కాంట్రాక్టర్
- వసతిలేక ప్రైవేటు హాస్టళ్లలో ఉంటున్న వైద్య విద్యార్థులు
- రోజూ పాల్వంచ నుంచి రాకపోకలకు అవస్థ

కొత్తగూడెంరూరల్: నిధుల కొరతతో మెడికల్ కళాశాల భవనాల నిర్మాణం ముందుకు సాగడం లేదు. దీంతో ఐదు నెలలుగా ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. సుమారు రూ.8 కోట్ల మేర పూర్తైన పనులకు బిల్లులు విడుదల కాకపోవడంతో సంబంధిత కాంట్రాక్టర్ భవన నిర్మాణాలను మధ్యలో నిలిపివేసినట్లు తెలుస్తోంది.

దారిమళ్లిన నిధులు!

గత బీఆర్ఎస్ ప్రభుత్వం మెడికల్ కళాశాల అనుబంధ భవనాలకు కేటాయించిన నిధులు దారి మళ్లించినట్లు తెలుస్తోంది. అప్పటి ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా రాష్ట్ర బడ్జెట్‌లో 500 కోట్ల రూపాయలు కేటాయించింది. తొలివిడతగా రూ. 105 కోట్లు కేటాయించగా, నిధులన్నీ విడుదల చేయలేదు. దీంతో బిల్లులు రాక పనుల్లో జాప్యం జరుగుతోంది. 2021 సంవత్సరంలో జిల్లాకు వైద్య కళాశాల మంజూరు చేయగా, అప్పటి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీష్‌రావు వచ్చి శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత మెడికల్ కాలేజీకి అనుబంధంగా నర్సింగ్ కాలేజీ కూడా మంజూరు చేశారు. మెడికల్ కళాశాలకు యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ప్రాంగణాన్ని ఎంపిక చేశారు. ఇక్కడ ఆరు అంతస్తుల్లో మెడికల్ కళాశాల, మరో ఆరు అంతస్తుల్లో విద్యార్థులకు వసతి గృహాలు నిర్మించాల్సిఉంది. కాగా కొన్ని భవనాల నిర్మాణం పూర్తి చేశారు.

రోజూ కిలోమీటర్ నడవాల్సిందే..

మెడికల్ కళాశాలలో ప్రస్తుతం మొదటి, రెండో సంవత్సరాలకు తరగతులు నిర్వహిస్తుండగా, మొత్తం 300 మంది మెడికోలు చదువుకుంటున్నారు. వీరంతా పాల్వంచ పట్టణంలోని ప్రైవేట్ హాస్టళ్లలో ఉంటూ కళాశాలకు వస్తున్నారు. పాల్వంచ నుంచి ఆటోలు, బస్సుల్లో కేఎస్ఎం స్టాప్ వద్ద దిగి, అక్కడి నుంచి కిలోమీటర్ దూరంలో ఉన్న మెడికల్ కళాశాలకు నడిచి వెళ్తున్నారు. ఈ నేపథ్యంలో భవనాల నిర్మాణం ఎప్పుడు పూర్తవుతుందోనని విద్యార్థులు ఎదురుచూస్తున్నారు. కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వమైనా నిధులు విడుదల చేయాలని, భవనాల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని పలువురు కోరుతున్నారు. ఉమ్మడి జిల్లా మంత్రులు చొరవ చూపాలని పేర్కొంటున్నారు.

హాస్టల్ భవనమైనా పూర్తి చేయాలి



మెడికల్ కళాశాలలో చదువుకుంటున్న విద్యార్థుల వసతి కోసం త్వరగా ఒక భవన నిర్మాణమైనా పూర్తిచేయాలి. ఇప్పటికే 300 మంది విద్యార్థులు ఉండగా, వచ్చే సంవత్సరం మరో 150 మంది విద్యార్థులు వస్తారు. వసతి సౌకర్యం లేక కల్పిస్తే విద్యార్థులకు ఇబ్బందులు తప్పుతాయి.

–లక్ష్మణ్‌రావు, ప్రిన్సిపాల్

గ్రామీణ బ్యాంకు ఉద్యోగుల సమ్మె



నినాదాలు చేస్తున్న బ్యాంకు ఉద్యోగులు

కొత్తగూడెంఅర్బన్: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం కొత్తగూడెంలో గ్రామీణ బ్యాంకు ఉద్యోగులు సమ్మె చేపట్టారు. గ్రామీణ బ్యాంకులన్నింటినీ నేషనల్ రూరల్ బ్యాంకు ఆఫ్ ఇండియాగా మార్చాలని, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆల్ ఇండియా రీజినల్ రూరల్ బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఒక రోజు సమ్మెకు పిలుపునిచ్చింది. దీంతో కొత్తగూడెంలో గ్రామీణ బ్యాంకు ఉద్యోగులు సమ్మెలో పాల్గొన్నారు. ఏపీజీవీబీ రీజినల్ ఆఫీస్ ముందు ఆందోళన చేశారు. సమస్యలు పరిష్కరించాలని నినదించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ రీజినల్ సెక్రటరీ గోవర్ధన్, అసిస్టెంట్ రీజినల్ సెక్రటరీ జలంధర్, ఎంప్లాయిస్ రీజినల్ సెక్రెటరీ విద్యాసాగర్, అసిస్టెంట్ సెక్రటరీ మాలోత్ కృష్ణ మాట్లాడారు. ప్రమోషన్ రూల్స్ రివైజ్ చేయాలని, ఖాళీగా ఉన్న 30 వేల ఉద్యోగాలను భర్తీ చేయాలని, డైలీ వేజ్ వర్కర్లను పర్మనెంట్ చేయాలని డిమాండ్ చేశారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

- కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల
- జిల్లా ప్రభుత్వాస్పత్రి తనిఖీ



ఎమర్జెన్సీ వార్డులో పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రియాంక తదితరులు

కొత్తగూడెంరూరల్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల వైద్యాధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆమె ఆస్పత్రిలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. అన్ని వార్డులు పరిశీలించారు. ఎమర్జెన్సీ వార్డును సందర్శించి, తాను వస్తున్నానని బెడ్లపై కొత్త బెడ్‌షీట్లు వేశారా? అని అధికారులను ప్రశ్నించారు. అనంతరం రోగులతో మాట్లాడి వైద్య సేవలు, మందులపై ఆరా తీశారు. ఆర్థోపెడిక్ వార్డు, ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌ను సందర్శించి, చికిత్స పొందుతున్నవారితో మాట్లాడారు. మెడికల్ స్టోర్స్, లేబర్ రూములు, ఆపరేషన్ థియేటర్లను పరిశీలించారు. సిబ్బంది హాజరు బయోమెట్రిక్ రికార్డులను పరిశీలించారు. అలసత్వం వహిస్తున్న వైద్యులు, సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బయోమెట్రిక్ హాజరువిధానం పటిష్టంగా అమలు చేయాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ లక్ష్మణ్‌రావును ఆదేశించారు. ఆస్పత్రిలో జరిగిన అభివృద్ధి పనులు, పెండింగ్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆస్పత్రి వెలుపల డ్రెయినేజీ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆర్అండ్‌బీ ఈఈ వెంకటేశ్వర్లును ఆదేశించారు. వారం రోజుల్లో పెండింగ్ పనులన్నీ పూర్తి చేయాలని ఏఈ విజయ్‌భాస్కర్‌కు సూచించారు. ప్రభుత్వాస్పత్రుల్లో అన్ని సదుపాయాలు కల్పిస్తున్నారని, వీటిని ప్రజలు వినియోగించుకోనేలా చూడాలని వైద్యాధికారులకు సూచించారు. ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లి, ప్రజలు ఆర్థికంగా నష్టపోకుండా అవగాహన కల్పించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ శిరీష, వైద్యాధికారులు పుష్పలత, వీరబాబు, సురేందర్, భూమమ్మ, భారతి తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' నిధులతో గ్రామీణ రోడ్లు

రూ. 25 కోట్లతో నిర్మాణ పనులు



ఇల్లెందు మండలం సుభాష్ నగర్‌లో నిర్మిస్తున్న సీసీ రోడ్డు

పాల్వంచరూరల్: గ్రామీణ ప్రాంతాల్లో అంతర్గత రోడ్లు అధ్వానంగా ఉండటంతో ప్రజలు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన రహదారులకు మరమ్మతులు చేస్తున్నా గ్రామాల్లో, తండాల్లోని అంతర్గత రోడ్లు కనీస మరమ్మతులకు నోచుకోవడం లేదు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం(ఎస్ఆర్ఈజీఎస్) ద్వారా అంతర్గత రోడ్ల నిర్మాణం చేపట్టేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో జిల్లాలో ఎస్ఆర్ఈజీఎస్ కింద రూ.25 కోట్లతో 590 రోడ్లు మంజూరయ్యాయి. ఇందులో పినపాక నియోజకవర్గానికి రూ.9 కోట్లు కేటాయించారు. అశ్వారావుపేటకు రూ. 7 కోట్లు, ఇల్లెందుకు రూ. 3 కోట్లు, కొత్తగూడేనికి రూ. 3 కోట్లు, భద్రాచలానికి రూ. 3 కోట్లు మంజూరు చేశారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో నిర్మాణ పనులు చేపడుతున్నారు. మరికొన్ని గ్రామాల్లో పనులు చేపట్టాల్సి ఉంది.

గడువు మార్చి 31 వరకే..

ఎస్ఆర్ఈజీఎస్ నిధుల ద్వారా మంజూరైన రహదారుల నిర్మాణ పనులను వచ్చే మార్చి 31వ తేదీ లోగా పూర్తి చేయాలని గడువు నిర్దేశించారు. అయితే గతేడాది కూడా ఇదే స్కీమ్ కింద మంజూరైన రోడ్ల పనులు నిర్దేశించిన గడువులో పూర్తి చేయలేదు. దీంతో అనేక ప్రాంతాల్లో రోడ్ల పనులు నిలిచిపోయాయి. ఈసారైనా గడువులోగా పూర్తి చేయాలని, నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని స్థానికులు కోరుతున్నారు. హడావుడిగా నాణ్యతా లోపాలతో నిర్మిస్తే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని పేర్కొంటున్నారు.

త్వరగా పూర్తిచేయాలి



ఉపాధి హామీ నిధులతో చేపడుతున్న పనులను మార్చి 31 నాటికి పూర్తి చేయాలి. లేనిపక్షంలో బిల్లులు సకాలంలో రావు. జిల్లా వ్యాప్తంగా 22 మండలాల్లో ఎస్ఆర్ఈజీఎస్ కింద రూ.25 కోట్ల వ్యయంతో 590 రోడ్లు మంజూరయ్యాయి. నిర్దేశించిన గడువులో నాణ్యతా ప్రమాణాలతో పనులు పూర్తి చేయాలి.

– ఎస్ శ్రీనివాసరావు, ఈఈ, పంచాయతీరాజ్‌శాఖ

న్యూఢిల్లీలో సీఎంపీఎఫ్ బోర్డు సమావేశం

సింగరేణి(కొత్తగూడెం): సీఎంపీఎఫ్ ట్రస్ట్ 180వ బోర్డ్ సమావేశం న్యూఢిల్లీలో గురువారం జరిగింది. ఈ సమావేశానికి ఏబీకేఎంఎస్(బీఎంఎస్) తరఫున కొత్తకాపు లక్ష్మారెడ్డి, ఆశిష్‌మూర్తి హాజరుకాగా, కనీస పెన్షన్ అమలు, సీఎంపీఎఫ్‌లో కొత్త రిక్రూట్‌మెంట్ విధానాన్ని అనుసరించాలని, అన్ని ప్రాంతీయ కార్యాలయాలను మే చివరి నాటికి ఆన్‌లైన్ చేసి ఆధునికీకరించాలని నిర్ణయించారు. అలాగే, రిటైర్డ్ ఉద్యోగుల పెండింగ్ సీఎంపీఎఫ్ కేసులు పరిశీలించి సకాలంలో చెల్లింపునకు చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారని బీఎంఎస్ నాయకులు ఓ ప్రకటనలో తెలిపారు.

ఈ-కేవైసీ చేయించాలి



ఎరువుల దుకాణాల్లో రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

దమ్మపేట: పీఎం కిసాన్ యోజన పథకానికి అర్హులైన రైతులందరితో తప్పనిసరిగా ఈ-కేవైసీ చేయించాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి బాబూరావు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన వ్యవసాయ అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. క్షేత్రస్థాయిలో పరిశీలించాకే పంట నమోదు వివరాలు నమోదు చేయాలన్నారు. అనంతరం వ్యవసాయ క్షేత్రాలను సిబ్బందితో కలిసి సందర్శించి, పంట నమోదును పరిశీలించారు. ఆ తర్వాత మండలంలోని ఎరువుల దుకాణాల గోదాంలను పరిశీలించి, స్టాక్ రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమాల్లో ఏడీఏ అఫ్జల్‌బేగం, ఏఓలు చంద్రశేఖర్‌రెడ్డి, నవీన్‌కుమార్, కరుణామయి, వినయ్, ఏఈఓలు దీప్తి, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

భూమి ఒకరిది.. పట్టా ఇంకొకరికి!

- రెవెన్యూ, వ్యవసాయ అధికారుల నిర్లక్ష్యం
- ఫిర్యాదు చేసినా స్పందన లేక హైకోర్టును ఆశ్రయించిన బాధిత రైతు
- జిల్లా, మండల అధికారులకు నోటీసులు జారీ చేసిన న్యాయస్థానం



బాధిత రైతు పడిగ పుల్లయ్య

టేకులపల్లి: టేకులపల్లి మండలం కొప్పురాయి రెవెన్యూ పరిధిలో రైతు పడిగ పుల్లయ్యకు సర్వే నంబర్ 161/26 లో నాలుగు ఎకరాల వ్యవసాయ భూమి ఉండగా... పట్టా మాత్రం పక్క గ్రామానికి చెందిన చింత పుల్లయ్య పేరిట రెవెన్యూ అధికారులు జారీ చేశారు. అంతేకాకుండా పక్క గ్రామంలోనే చింత పుల్లయ్య పేరిట మరో పట్టాదారు పాస్‌పుస్తకం కూడా ఇచ్చారు. పాస్ పుస్తకాలు జారీ చేసే సమయాన గ్రామంలో ఒక రైతు ఎంత భూమి ఉన్నా ఒకే పాస్‌పుస్తకం జారీచేయాలి. కానీ రెండు పాస్ పుస్తకాలు వచ్చినా అధికారులు పట్టించుకోలేదు. దీనికి తోడు రైతుబంధు నగదు కూడా సదరు రైతు పేరిట ఇస్తుండగా వ్యవసాయ అధికారులు సైతం పరిశీలనలో గుర్తించలేదు. ఈ విషయమై బాధిత రైతు పడిగ పుల్లయ్య టేకులపల్లి తహసీల్ చుట్టూ తిరిగినా పట్టించుకోలేదు. చివరకు ఆయన తన భూమిపై ఇంకో వ్యక్తి ఎన్నేళ్లుగా రైతుబంధు తీసుకుంటున్నాడనే అంశాన్ని సమాచార హక్కు చట్టం కింద కోరితే వివరాలు ఇచ్చారే తప్ప తదుపరి చర్యలు తీసుకోలేదు. చివరకు కలెక్టరేట్‌లో జరిగే గ్రీవెన్స్ డేలో ఫిర్యాదు చేస్తే మళ్లీ టేకులపల్లి తహసీల్‌కు బదిలీ చేసి చేతులు దులుపుకున్నారు. చివరకు ఏం చేయాలో పాలుపోక సదరు రైతు పడిగ పుల్లయ్య న్యాయవాది బి.శిరీష సహకారంతో హైకోర్టును ఆశ్రయించాడు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన ఉన్నత న్యాయస్థానం సదరు రైతు కేసును ఎందుకు తీసుకోకూడదో తెలపాలంటూ భద్రాద్రి కలెక్టర్, కొత్తగూడెం ఆర్డీఓ, భద్రాద్రి వ్యవసాయ శాఖ అధికారి, టేకులపల్లి తహసీల్దార్, ఆర్ఐ, ఏఓ, ఏఈఓలకు ఈనెల 20న నోటీసులు జారీ చేసింది. అంతే కాకుండా పడిగ పుల్లయ్యకు ఉన్న నాలుగెకరాల భూమిపై ఎలాంటి లావాదేవీలు జరపొద్దని ఆదేశించిందని రైతు శుక్రవారం స్థానిక విలేకరులకు వెల్లడించాడు.

క్లుప్తంగా

అటవీ వ్యవసాయంపై శిక్షణ



శిక్షణలో పాల్గొన్న శాస్త్రవేత్తలు, అధికారులు, రైతులు

దమ్మపేట: మండలంలోని పట్వారిగూడెంలో గిరిజనులకు అటవీ వ్యవసాయ పద్ధతులపై శిక్షణ ఏర్పాటు చేశారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త డాక్టర్ ఏపీ రామాంజనేయులు ఆధ్వర్యాన ఈ శిక్షణ ఇవ్వగా, జామాయిల్, పామాయిల్, జీడిమామిడి, కుంకుడు తదితర పంటల సాగు, అందులో సాగుకు అవకాశమున్న అంతర పంటలు, ఎరువుల యాజమాన్యం, సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కొత్తగూడెం కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ లక్ష్మీనారాయణమ్మతోపాటు రంగారావు, రమేశ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులు ఆర్థిక క్రమశిక్షణ పాటించాలి



మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్

భద్రాచలం: ఉద్యోగులు ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తూ కుటుంబాలను తీర్చిదిద్దుకోవాలని ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ సూచించారు. భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో శుక్రవారం ఉద్యోగులు, సిబ్బందికి అవగాహన కల్పించేలా బ్యాంకర్లు, ఇన్వెస్టర్లతో నిర్వహించిన సదస్సులో పీఓ మాట్లాడారు. ఉద్యోగులు పలువురు అవగాహన లేక వివిధ రంగాల్లో పెట్టుబడి పెట్టి నష్టపోతున్నట్లు గుర్తించి సదస్సు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఏళ్ల పాటు ఉద్యోగాలు చేసేవారు జాగ్రత్తగా పొదుపు చేస్తూ రిటైర్ అయ్యాక ఇబ్బందులు ఎదురుకాకుండా చూసుకోవాలన్నారు. అనంతరం వివిధ బ్యాంకుల ప్రతినిధులు డబ్బు పొదుపు, కాల పరిమితికి సంబంధించి అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, ఐటీడీఏ ఉద్యోగులు సురేశ్‌బాబు, రమణయ్య, నర్సింహారావు, ఆదినారాయణ, హరికృష్ణ, బ్యాంకుల ప్రతినిధులు హేమంత్, స్పందన, రమేశ్, ముకేశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించాలి



టోర్నమెంట్ టీషర్టులను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

కొత్తగూడెంఅర్బన్: సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో ఈ నెల 24, 25,26 తేదీల్లో హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో నిర్వహించే క్రికెట్ టోర్నమెంట్‌లో ప్రతిభ చూపాలని ఎమ్మెల్యేం కూనంనేని సాంబశివరావు సూచించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో క్రికెట్ క్రీడాకారులకు అందజేస్తున్న క్రీడా దుస్తులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా జట్టులో రాష్ట్రస్థాయిలో విజేతగా నిలవాలని ఆకాంక్షించారు. క్రికెట్ జట్టు సభ్యులకు ఆశ్రమ పాఠశాల కాంట్రాక్టు ఉపాధ్యాయుడు గుగులోత్ రూప్లా నాయక్ ఆర్థికసాయంతో టీషర్టులు అందించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా, మండల యువజన కాంగ్రెస్ నాయకులు భూక్య కిషన్, అజ్మీర మోహన్, ధరావత గణేష్, క్రికెట్ టీం లీడర్ ధరావత్ సురేష్, ఉపాధ్యాయులు రమేష్, నాగేశ్వరరావు, రామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అదుపుతప్పి పల్టీకొట్టిన ఆటో

10 మంది కూలీలకు తీవ్ర గాయాలు

కల్లూరురూరల్: కల్లూరు మండలంలోని పెద్ద కోరుకొండి వద్ద శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో పది మంది కూలీలకు తీవ్ర గాయాలయ్యాయి. తల్లాడ మండలం కుర్నవెల్లి నుంచి ఆంధ్రాలోని ఎన్టీఆర్ జిల్లా ఊటుకూరుకు మొక్కజొన్న కంకులు విరిచేందుకు గాను ఆటోలో కూలీలు బయలుదేరారు. ఈక్రమంలో పెద్దకోరుకొండి రైతు వేదిక వద్ద ద్విచక్ర వాహనాన్ని తప్పించే క్రమాన ఆటో బోల్తా పడగా, ఈలప్రోలు సైదా, ఈలప్రోలు రాధమ్మ, మల్లారపు భద్రమ్మ, సీమకుర్తి కృష్ణమ్మ, సూరం ఈశ్వరమ్మ, మల్లారపు ఈశ్వరి, బండి పద్మ, సీమకుర్తి వెంకమ్మ ఎదుల పద్మతో పాటు ఆటో డ్రైవర్ వెంకటేశ్వర్‌రెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. దీంతో స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు క్షతగాత్రులను కల్లూరు ప్రభుత్వాస్పత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం ఖమ్మం తరలించారు. ఘటనా స్థలాన్ని కల్లూరు ఎస్సై ఎస్.కే.షాకీర్ సందర్శించి కేసు నమోదు చేయగా, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి వైద్యులకు ఫోన్‌లో సూచించారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.12,595

సర్దుబాటు సరే.. జీతాలేవి?

- ఐదునెలలుగా వేతనాలు అందక 104 ఉద్యోగుల అవస్థలు
- సేవలు రద్దు చేశాక ఇతర శాఖల్లోకి ఉద్యోగులు
- వేతనాలు చెల్లించడంలో ఉన్నతాధికారుల నిర్లక్ష్యం
- ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 160 మంది ఉద్యోగుల ఆవేదన



ఖమ్మం జిల్లా ఆస్పత్రిలో మూలనపడిన 104 వాహనాలు

ఖమ్మంవైద్యవిభాగం: గ్రామీణ ప్రాంతాల్లో దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు సేవలందించిన 104 వ్యవస్థకు గత ప్రభుత్వం మంగళం పలికింది. దీంతో వాహనాల్లో పనిచేస్తున్న ఉద్యోగులను వివిధ ఆస్పత్రుల్లో సర్దుబాటు చేసిన ఉన్నతాధికారులు వారికి జీతాలు చెల్లించడంలో మాత్రం తీవ్ర నిర్లక్ష్యం కనబరుస్తున్నారు. వాహనాలను పక్కన పెట్టినప్పటి నుంచి సిబ్బంది సేవలను వినియోగించుకుంటున్నా వేతనాల విషయంలో పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

గతేడాది అక్టోబర్ నుంచి...

104లో పనిచేస్తూ ఇతర శాఖల్లో సర్దుబాటు చేసిన ఉద్యోగులకు గత ఏడాది అక్టోబర్ నుంచి జీతాలు రాకపోవడంతో ఇంటి అద్దె కట్టలేక, కుటుంబాలను పోషించలేక అప్పుల పాలవుతున్నారు. 104 వాహనాల్లో విధులు నిర్వర్తించిన ఉద్యోగులను రెండేళ్ల క్రితం వైద్య ఆరోగ్య, వైద్య విధాన పరిషత్ ఆస్పత్రుల్లో సర్దుబాటు చేశారు. ఒక్కో వాహనంలో ఫార్మసిస్ట్, ల్యాబ్ టెక్నీషియన్, డ్రైవర్, డేటా ఎంట్రీ ఆపరేటర్, సెక్యూరిటీ గార్డ్ సేవలందించేవారు. ఇలా ఖమ్మం జిల్లాలో 90 మంది, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 70 మంది కలిపి 160మంది ఉండగా, 2022 జనవరిలో సేవలు రద్దు చేశాక సిబ్బందిని ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో సర్దుబాటు చేశారు. అప్పటి నుంచి జీతాలు నెలనెలా సక్రమంగా చెల్లించకపోవడంతో ఇబ్బందులు పడుతూ నెట్టుకొచ్చారు. కానీ గత ఐదు నెలలుగా అసలే వేతనాలు అందకపోవడంతో ఎదురుచూస్తుండగా... ఉన్నతాధికారులు తమ గోడు పట్టించుకొని వేతనాలు చెల్లించాలని వేడుకుంటున్నారు.

తుప్పు పడుతున్న వాహనాలు

మరో పక్క 104 సేవలను రద్దు చేసిన ప్రభుత్వం ఆ వాహనాలను మరిచిపోయింది. దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి ఆలోచనల నుంచి పురుడు పోసుకున్న ఈ సేవలు 2008లో అందుబాటులోకి వచ్చాయి. ఉమ్మడి జిల్లాలో 23 వాహనాల ద్వారా సిబ్బంది లక్షల మందికి సేవలందించారు. అయితే, సేవలు నిలిచిపోయాక వాహనాలను వేలం వేసినా ఆదాయం వచ్చేది. లేకపోతే ఇతర అవసరాలకు వినియోగించుకోవాల్సిన ఉన్నా బాగుండేది. అధికారులు ఆ దిశగా ఆలోచన చేయకుండా ఖమ్మం జిల్లాకు కేటాయించిన 11 వాహనాలను జిల్లా జనరల్ ఆస్పత్రిలో పక్కన పెట్టేశారు. దీంతో రెండేళ్లుగా వానకు తడిచి, ఎండకు ఎండి తుప్పుపట్టాయి. పూర్తిగా శిథిలావస్థకు చేరే లోపైనా వాహనాలను వేలం వేస్తే కొంత ఆదాయం సమకూరే అవకాశం ఉంది.

దుర్భర పరిస్థితి ఎదుర్కొంటున్నాం...



ఐదు నెలలుగా వేతనాలు రాక కుటుంబ పోషణ ఇబ్బందిగా మారింది. ఔట్ సోర్సింగ్ వ్యవస్థకు అప్పగించడంతోనే జాప్యం జరుగుతోంది. అప్పట్లో కొందరు తీసుకున్న నిర్ణయాలతో మేం నష్టపోతున్నాం. ఇకనైనా మమ్ముల్ని రెగ్యులర్ లేదా పూర్తిగా కాంట్రాక్ట్ పద్ధతిలోకైనా మార్చి మా బతుకులకు భరోసా కల్పించాలి.

– మన్మథరావు, 104 ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు

మామిడి ఆదుకునేనా?



సిద్ధినేనిగూడెంలో మామిడి తోట (ఇన్‌సెట్) నల్లగా మారుతున్న పూత

తోటలు సాగుచేస్తున్న రైతులు విలవిల

- పూత దశలోనే చీడపీడలతో నష్టం
- పిందెగా మారినా నాణ్యత కోల్పోతున్న కాయలు
- గాలి, దుమ్ము, అకాల వర్షాలతో ఏటా ఇక్కట్లే
- ఫలితంగా జిల్లాలో తగ్గిపోతున్న మామిడి సాగు

మధిర: ఖమ్మం జిల్లాలో సాగుచేసిన మామిడి తోటలను చీడపీడలు ఆశించడంతో ఆశించిన స్థాయిలో దిగుబడి వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. దీంతో మామిడి రైతులు విలవిల్లాడుతున్నారు. ప్రస్తుతం మామిడికి నల్ల నల్లి, ఎర్ర నల్లి, తేనెమంచు పురుగు, తెల్ల దోమ, పచ్చ దోమ ఆశించాయి. ఫలితంగా పూత పిందెగా మారడం లేదు. జిల్లాలో మామిడి తోటలు ఇప్పుడు పిందె దశలో ఉన్నా యి. ఈ సమయాన ఆశించిన తెగుళ్ల కారణంగా ఎదుగుదల లేకపోవడమేకాక పూతతో పాటు పిందెలూ రాలిపోతున్నాయి. దీంతో మామిడి దిగుబడిపై ఆశలు పెట్టుకున్న రైతులు దేవుడిపై భారం వేసి కాలం గడుపుతున్నారు.

31,607 ఎకరాల్లో తోటలు

జిల్లాలో సత్తుపల్లి, వేంసూరు, పెనుబల్లి, కల్లూరు, తల్లాడ, కొణిజర్ల, రఘునాథపాలెం, ఎర్రుపాలెం, చింతకాని, ముదిగొండ మండలాల్లో మామిడి సాగు విస్తీర్ణం ఎక్కువగా ఉంది. జిల్లాలో ఈ ఏడాది వానాకాలం నాటికి 31,607 ఎకరాల్లో మామిడి సాగు చేపట్టారు. కాగా, పూతను పొగ మంచు సమయాన తేనె మంచు పురుగు ఆశించి నల్లని బంక మాదిరి ఏర్పడుతోంది. దీంతో పూత రాలిపోతుండగా.. ఒకవేళ పిందె ఏర్పడి కాయలుగా మారినా కోతకు వచ్చే దశలో మంగు వస్తుంది. ఫలితంగా కాయలు నాణ్యత లేక మార్కెట్‌లో ఆశించిన ధర రాదని రైతులు చెబుతున్నారు.

జిల్లాలో మామిడి, ఆయిల్‌ఫామ్ సాగు వివరాలు (ఎకరాల్లో)

ఏడాది	మామిడి	ఆయిల్ ఫామ్
2019	33,779	4,866
2020	31,994	6,192
2021	33,907	6,918
2022	31,114	9,686
2023	31,607	18,670

అసలే ఆలస్యం

సాధారణంగా మార్చి నాటికి మామిడికాయలు కోతకు రావడం, ఏప్రిల్‌లో పండు పక్వానికి రావడం సహజం. కానీ ఈ ఏడాది మార్చి వస్తున్నా చాలావరకు తోటలు పూత, పిందె దశలోనే ఉన్నాయి. ఇదిలా ఉండగా మార్చి, ఏప్రిల్, మే నెలల్లో అకాల వర్షాలు, గాలిదుమ్ము, వడగండ్ల వానలు కురిసే ప్రమాదం పొంచి ఉంది. గతంలోనూ ఇలా జరగగా మామిడి పంటకు తీరని నష్టం వాటిల్లింది. దీంతో చీడపీడల నుంచి తోటలను కాపాడుకున్నా అకాల వర్షాలతో నష్టం జరిగే ప్రమాదం ఉండడంతో రైతులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని కాలం గడుపుతున్నారు.

నష్టాలు భరించలేక..

ఏటా ఏదో రూపంలో నష్టాలు ఎదురవుతుండడంతో రైతులు మామిడి సాగు విస్తీర్ణాన్ని తగ్గిస్తున్నారు. దీనికి తోడు ప్రభుత్వ పరంగా ప్రోత్సాహం లేకపోవడం, పంటకు మార్కెటింగ్ లేకపోవడం, ధర వచ్చే వరకు శీతల గిడ్డంగుల్లో నిల్వ చేసే అవకాశం లేక రైతాంగం నష్టపోతోంది. మామిడికాయలను నిల్వ చేసి ధర ఉన్నప్పుడు అమ్ముకునేలా ప్రభుత్వం శీతల గిడ్డంగులను నిర్మిస్తే రైతులు పంట సాగుపై ఆసక్తి చూపే అవకాశముంది. మరోపక్క ఆయిల్ పామ్ సాగు చేసే రైతులకు ఉచితంగా మొక్కలు, డ్రిప్‌పై సబ్సిడీ ఇస్తుండడంతో ఆ పంట సాగు ఏటా పెరుగుతోంది.

వాగులో మునిగి యువకుడు మృతి

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలంలోని గడ్డిగుట్ట సమ్మక్క, సారలమ్మ జాతరకు సేహ్నితులతో వెళ్లిన యువకుడు.. స్నానం చేసేందుకు వాగులో దిగి మునిగిపోయి మృతి చెందాడు. శుక్రవారం యువకుడి మృతదేహం లభించింది. స్థానికుల కథనం మేరకు.. తెలగరామవరానికి చెందిన వినోదరావు శ్రావణ్ (22) గురువారం సేహ్నితులతో కలిసి గడ్డిగుట్ట వద్ద ఉన్న సమ్మక్క, సారలమ్మ జాతరకు వెళ్లాడు. అక్కడ మధ్యాహ్న భోజనం అనంతరం స్నానం చేసేందుకు పక్కనే ఉన్న పుల్లిగుండం వాగులోకి దిగారు. ఇదిలా ఉండగా శ్రావణ్ నీటిలో మునిగిపోయి కనిపించడం లేదని గురువారం అతడి బాబాయి వినోద్‌రావు సురేందర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ రమణారెడ్డి ఆధ్వర్యంలో గాలింపు చేపట్టగా ఆచూకీ లభించలేదు. శుక్రవారం ఉదయం స్థానికులు పురుషోత్తమరావు ఆధ్వర్యంలో గజ ఈతగాళ్లు గాలింపు చేపట్టగా శ్రావణ్ మృతదేహం లభ్యమవగా కొత్తగూడెం ప్రభుత్వాస్పత్రికి తరలించి పోస్టుమార్టం చేశారు. మృతుడి బాబాయి వినోదరావు సురేందర్, పిన్ని విజయ ఫిర్యాదు చేయగా.. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా కేసు నమోదు చేస్తామని ఎస్‌ఐ రమణారెడ్డి తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడు...

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలం తోకబంధాల గ్రామానికి చెందిన గొప్ప చలపతి (20) మైలారం – బంగారుచెలక ప్రధాన రహదారి పక్కన అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. మృతదేహం పరిసర ప్రాంతంలో సీసాలు, చున్నీ ఉన్నాయి. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ రమణారెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని పరిసర ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం చలపతి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మేడారం వెళ్లివస్తూ...

కామేపల్లి: కుటుంబ సమేతంగా మేడారంలో వనదేవతల దర్శనానికి వెళ్లిన వ్యక్తి తిరుగు ప్రయాణంలో గుండెపోటుతో మృతి చెందాడు. మండలంలోని పండితాపురానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు బత్తుల చంద్రయ్య(55) భార్య, కూతురుతో కలిసి గురువారం మేడారం వెళ్లాడు. అక్కడ దర్శనం అనంతరం శుక్రవారం వస్తుండగా గుండెపోటుకు గురయ్యాడు. దీంతో ఆయనను 108 వాహనంలో ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు.

సమ్మక్క-సారలమ్మను దర్శించుకున్న ఎంపీ రవిచంద్ర

ఖమ్మంమయూరిసెంటర్: ములుగు జిల్లా మేడారంలో కొలువైన సమ్మక్క–సారలమ్మలను రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర శుక్రవారం తన కుటుంబ సభ్యులు, అనుచరులతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దేవాదాయ, ధర్మాదాయ శాఖ అధికారులు, ఆలయ కమిటీ బాధ్యులు ఎంపీకి స్వాగతం పలకగా, తల్లులకు నిలువెత్తు బంగారాన్ని సమర్పించిన ఆయన మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే మేడారం వెళ్తున్న సందర్భంగా మార్గమధ్యలో ములుగు సమీపాన ఉన్న గట్టమ్మ తల్లిని సైతం ఎంపీ దర్శించుకున్నారు.



మేడారంలో అమ్మవార్ల గద్దెల వద్ద ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, కుటుంబీకులు

ఎద్దును ఢీకొట్టిన లారీ..



ఎద్దును ఢీకొట్టిన లారీ

టేకులపల్లి: కేటీసీ నుంచి బొగ్గు రవాణా చేసే లారీలు, టిప్పర్ల డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, అధిక వేగం తగ్గించాలని అధికారులు పదేపదే చెబుతున్నా కొందరు యజమానులు, డ్రైవర్లు పెడచెవిన పెడుతున్నారు. మండలంలోని పత్రాంచేలక్ష్టేజీ వద్ద గురువారం రాత్రి కేటీసీ నుంచి ఇల్లెందుకు బొగ్గు రవాణా చేసే లారీ వేగంగా దూసుకొచ్చి తేజావత్ భద్రుకు చెందిన ఎద్దును ఢీకొట్టడంతో దవడలు పగిలిపోయి, శరీరానికి, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. తినలేక, తాగలేక దీన స్థితిలో జీవచ్ఛవంలా ఎద్దు పడి ఉంది. ఎదు గాయాలపాలు కావడానికి కారకుల నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో రైతు ఆందోళన చెందుతున్నాడు. సుమారు రూ.70 వేల విలువైన ఎద్దును ఢీకొట్టిన వారు పట్టించుకోవడం లేదని సింగరేణి యాజమాన్యం స్పందించి తనకు న్యాయం చేయాలని రైతు కోరారు.

గుండెపోటుతో రిటైర్డ్ తహసీల్దార్ మృతి



నర్సింహారావు (ఫైల్)

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం గుట్టలబజార్‌లో నివాసముంటున్న రిటైర్డ్ తహసీల్దార్ నున్నా నర్సింహారావు(78) శుక్రవారం గుండెపోటుతో మరణించారు. దమ్మపేట, కూసవరం తదితర మండలాల్లో తహసీల్దార్‌గా విధులు నిర్వర్తించిన ఆయన కలెక్టరేట్‌లో ఏఓగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందారు. ఆయనకు భార్య రాజేశ్వరితో పాటు ముగ్గురు పిల్లలు ఉన్నారు. కాగా, రిటైర్డ్ అయ్యాక గుట్టలబజార్‌లోని శ్రీ విఘ్నేశ్వర సహిత దాసాంజనేయ స్వామి ఆలయ చైర్మన్‌గా వ్యవహరిస్తున్న నర్సింహారావు మృతిపై పలువురు సంతాపం ప్రకటించారు. ఈ మేరకు ఆయన మృతదేహం వద్ద డాక్టర్ గంగరాజు, కార్మిక సంఘాలు, చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు నున్నా మాధవరావు, ధనాల కొండయ్య, నున్నా సత్యనారాయణ తదితరులు నివాళులర్పించారు.


మే 17న పాలిటెక్నిక్ ప్రవేశపరీక్ష

సింగరేణి(కొత్తగూడెం): పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశానికి మే 17న పరీక్ష నిర్వహించనున్నట్లు రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ విషయాన్ని కొత్తగూడెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ నాగమునినాయక్ వెల్లడించారు. ప్రవేశపరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుని ఫీజు చెల్లించాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులైతే రూ.250, ఇతరులు రూ.500 ఫీజు చెల్లించి అపరాధ రుసుం లేకుండా ఏప్రిల్ 22వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. అలాగే, రూ. 300 జరిమానాతో ఏప్రిల్ 26వరకు ఫీజు చెల్లించవచ్చని తెలిపారు. పూర్తి వివరాల కోసం polycet.sbtet.telangana.gov.in వెబ్‌సైట్‌లో పరిశీలించాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

పెనుబల్లి: ద్విచక్రవాహనం అదుపుతప్పి కింద పడడంతో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. భద్రాద్రి జిల్లా అన్నపురెడ్డి మండలం మద్రిగూడెం గ్రామానికి చెందిన వేపాకుల వెంకన్న శుక్రవారం ద్విచక్రవాహనంపై తిరువూరు వైపు నుంచి వస్తున్నాడు. ఈ క్రమంలో పెనుబల్లి మండలం బయ్యన్నగూడెం సాయినగర్ సమీపాన బైక్ అదుపుతప్పి కింద పడగా వెంకన్నకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో స్థానికులు ఆయన్ను పెనుబల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

లక్ష్మీనగరంలో చోరీకి విఫలయత్నం



షట్టర్ తాళాలను పగలకొడుతున్న వ్యక్తి

దుమ్ముగూడెం: మండలంలోని లక్ష్మీనగరం గ్రామంలో ఇద్దరు దుండగులు గురువారం అర్ధరాత్రి ఓ సూపర్ మార్కెట్‌లో చోరీకి విఫలయత్నం చేశారు. తమ వెంట తీసుకొచ్చిన గునపంతో షెట్టర్ తాళాలను పగలగొట్టేందుకు తీవ్రంగా యత్నించారు. 20 నిమిషాల పాటు పెనుగులాడినా షెట్టర్‌లు తెరుచుకోకపోవడంతో అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ దృశ్యాలన్నీ సీసీ కెమెరాల్లో స్పష్టంగా కనిపిస్తున్నాయి. అలాగే, లక్ష్మీనగరం గ్రామంలోని సూర్యశ్రీ ఆగ్రోసీడ్స్ షట్టర్ తాళాలు తొలగించి దుకాణంలోకి ప్రవేశించి క్యాష్ కౌంటర్‌లోని నగదును అపహరించారని యజమాని తెలిపాడు. విషయాన్ని పోలీసులకు తెలిపారు.

మద్యం తాగొద్దన్నందుకు ఆత్మహత్య

మణుగూరుటౌన్: మద్యానికి బానిసై, పనికి వెళ్లకుండా ఆకతాయిలా మారిన వ్యక్తిని మద్యం మానేయాలని చెప్పడంతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన శుక్రవారం మణుగూరులో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని బాపనకుంటకు చెందిన కుమ్మరికుంట్ల సత్యం (50) బొగ్గు ముఠాలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొద్ది రోజులుగా విధులకు వెళ్లకుండా ఇంటి వద్దే ఉంటూ మద్యానికి బానిసగా మారాడు. మద్యం మాని విధులకు వెళ్లాలని భార్య శాంత చెప్పడంతో క్షణికావేశంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

పెట్రోల్‌లో నీళ్లు వచ్చాయంటూ నిరసన



పెట్రోల్ బాటిల్‌ను చూపుతున్న బాధితుడు

సుజాతనగర్: మండలంలోని హెచ్‌పీ బంకులో పెట్రోల్‌లో నీళ్లు వచ్చాయంటూ ఓ యువకుడు నిరసనకు దిగాడు.. వివరాలిలా ఉన్నాయి.. జూలూరుపాడు మండలం గుండ్లరేవు గ్రామానికి బానోత్ జగన్నాథం తన ద్విచక్రవాహనంలో స్థానిక నాయక్ బంకులో శుక్రవారం రూ.200 పెట్రోల్ పోయించుకుని రెండు కిలోమీటర్లు వెళ్లగా బైక్ ఆగిపోయింది. పెట్రోల్‌లో నీరు కలిసినందునే బైక్ ఆగిందని మెకానిక్ చెప్పడంతో ద్విచక్ర వాహనంలో ఉన్న పెట్రోల్‌ను బాటిల్లో నింపి బంకు వద్దకు వెళ్లి సిబ్బందిని ప్రశ్నించాడు. స్థానిక పోలీసులు అక్కడికి చేరుకొని ఘటనపై ఫిర్యాదు చేయాలని చెప్పగా.. బంకు సిబ్బంది నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. జిల్లా తూనికలు, కొలతల శాఖ అధికారి ఎం.మనోహర్ బంకు వద్దకు చేరుకొని తనిఖీ చేశారు. కొలతలు సరిగ్గానే ఉన్నట్లు చెప్పారు.

పేకాట శిబిరంపై దాడి

దమ్మపేట: మండలంలోని నాయుడుపేట గ్రామ శివారులో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు గురువారం రాత్రి దాడి చేశారు. వివరాలివీ.. నాయుడుపేట శివారులో పేకాట ఆడుతున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్‌ఐ సాయికిశోర్‌రెడ్డి.. సిబ్బందితో అక్కడికి వెళ్లగా పేకాట ఆడుతున్నవారు పారిపోయారు. వారి మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని, వాటి ఆధారంగా శుక్రవారం విచారణ జరిపి నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.5,060 నగదును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.

కారు, బస్సు ఢీ

బూర్గంపాడు: మండలంలోని మోరంపల్లిబంజర గ్రామసమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డుప్రమాదంలో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. ఖమ్మం నుంచి భద్రాచలం వైపునకు వస్తున్న కారు, మేడారం నుంచి టేకులపల్లి వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో కారు ముందు భాగం పూర్తిగా దెబ్బతింది. ప్రమాదం జరిగిన సమయంలో కారులోని ఎయిర్‌బ్యాగులు తెరుచుకోవటంతో లోపలివారు స్వల్పగాయాలతో బయటపడ్డారు. కారులో దంపతులు, ఓ చిన్నారి ఉన్నారు. కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం కలగగా పోలీసులు చేరుకుని పునరుద్ధరించారు. బస్సును పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.